క్లుప్తంగా

అనిల్‌బాబుకు ప్రసన్న పరామర్శ



గోవిందయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రసన్న

కోవూరు: ఆప్కాఫ్ మాజీ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు తండ్రి గోవిందయ్య ఇటీవల మరణించారు. ఈ నేపథ్యంలో అల్లూరు మండలం, ఇస్కపల్లి పంచాయతీ, సంభునివారిపల్లెలోని ఆయన నివాసానికి మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సోమవారం వెళ్లి అనిల్‌బాబును పరామర్శించారు. అనంతరం గోవిందయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ నేతలు వీరి చలపతిరావు, పూండ్ల అచ్యుత్‌రెడ్డి, కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, పొన్నాల కృష్ణారెడ్డి, ఇనగంటి సురేంద్రరెడ్డి, నారాయణ, నాగేళ్ల శీనయ్య ఉన్నారు.

యోగా పోటీల్లో ప్రతిభ



మొబీనాను అభినందిస్తున్న ప్రిన్సిపల్

వెంకటాచలం: నెల్లూరులో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ – 17 రిథమిక్ యోగా పోటీల్లో మండలంలోని గొలగమూడి వద్దనున్న ఎంజేపీఏపీ బీసీ గురుకుల బాలికల పాఠశాలలో 9 తరగతి చదువుతున్న ఎస్‌కే మొబీనా తృతీయ స్థానంలో నిలిచింది. దీంతో సోమవారం ప్రిన్సిపల్ వీవీ రమణప్రసాద్, ఉపాధ్యాయులు బాలికను అభినందించారు.

విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో సోమవారం విద్యార్థులు, అధ్యాపకులకు డేటా విశ్లేషణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ విజయ భాస్కరరావు మాట్లాడుతూ ఆధునిక డేటా విశ్లేషణ పద్ధతులను నేర్చుకోవడంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ చాలా కీలకమైందని పేర్కొన్నారు. ఎస్‌పీఎస్ఎస్ సాఫ్ట్‌వేర్ ఉపయోగం తదితర అంశాలపై డాక్టర్ రాజ్‌కమల్ వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

బియ్యం లారీ తనిఖీ



పట్టుకున్న బియ్యం లారీ

కోవూరు: సింగరాయకొండ నుంచి చెన్నైకి బియ్యం లోడుతో వెళ్తున్న లారీని కోవూరు మండలంలోని ఇనమడుగు సెంటర్ వద్ద సోమవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. తనిఖీ చేసి సివిల్ సప్‌లైస్ అధికారులకు అప్పగించారు. విషయం తెలుసుకున్న కోవూరు రెవెన్యూ అధికారులు దాన్ని పరిశీలించారు. అనంతరం నెల్లూరు సివిల్ సప్‌లై అధికారులకు సమాచారం ఇవ్వడంతో అక్కడి నుండి బియ్యం పరిశీలన బృందం కోవూరుకు చేరుకుంది. వారు పరిశీలించి ఇవి స్టోర్ బియ్యం కాదని, రైస్ మిల్లు నుంచి వచ్చిన బియ్యమేనని నిర్ధారించారు. తెల్లవారుజామున 4 గంటలకు తనిఖీ చేసిన ఈ లారీ సోమవారం మధ్యాహ్నం వరకు కోవూరులో ఓ గోడౌన్‌లో రహస్యంగా దాచి పెట్టారు. ఈ విషయం నలుగురికి తెలిస్తే ఎక్కడ రచ్చ జరుగుతుందోనని అధికారులను మేనేజ్ చేసుకుని ఆ లారీని పంపించేశారు. ఈ విషయమై సంబంధిత అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించినా ఆ బియ్యం పీడీఎస్ రైస్‌కాదని రైస్ మిల్లు నుంచే వచ్చాయని తేటతెల్లంచేశారు.

పరీక్షలకు 682 మంది విద్యార్థుల గైర్హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో సోమవారం నిర్వహించిన డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్షలకు 682 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. 8,713 మందికి గానూ 8,031 మంది హాజరయ్యారని తెలియజేశారు.

సమస్యలను పరిష్కరిస్తాం

వెంకటాచలం: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన వెంకటాచలంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి ఎమ్మెల్యే, నెల్లూరు ఆర్డీఓ అనూష అర్జీలను స్వీకరించారు.

ప్రయాణం.. నరకప్రాయం

- అర్థాంతరంగా ఆగిన రోడ్డు నిర్మాణ పనులు
- బిల్లులు ఇవ్వలేదని నిలిపేసిన కాంట్రాక్టర్లు
- గత ప్రభుత్వంలో రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు
- 70 శాతం పూర్తి చేసిన వైనం



అసంపూర్తిగా నిలిచిపోయిన నావూరు రోడ్డు

పొదలకూరు: మండలంలో గ్రామాలను కలిపే ప్రధాన రహదారులుగా నావూరు, కనుపర్తి రోడ్లున్నాయి. వీటి పనులు చాలాకాలంగా చేపట్టకపోవడంతో గుంతలమయంగా మారాయి. ఆయా గ్రామాల ప్రజల అభ్యర్థన మేరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నిధులు సాధించారు. ఏఎంసీలో కనుపర్తి రోడ్డుకు రూ.1.50 కోట్లు, పొదలకూరు – సంగం మెయిన్ రోడ్డు నుంచి నావూరు మీదుగా చేజర్ల మండలం కొండలరాయుడుకండ్రిక వరకు రూ.10.83 కోట్లు విడుదల చేయించి పనులు మొదలు పెట్టించారు. కాంట్రాక్టర్లు త్వరతగతిన మెటల్ తోలించి ఇరువైపుల మార్జిన్ పనులతోపాటు రోడ్డు నిర్మాణ కోసం మెటల్ పరిచి రోలింగ్ చేయించారు. 70 శాతం రోడ్ల పనులు పీఆర్ పర్యవేక్షణలో పూర్తి చేయడం జరిగింది. తర్వాత ఎన్నికలు రావడంతో అభివృద్ధి పనులు పక్కన పెట్టగా ఆయా గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నావూరు రోడ్డు మీదుగా ప్రభగిరిపట్నం, అమ్మవారిపాళెం,



కంకర తేలిన కనుపర్తి రోడ్డు

నావూరుపల్లి, నావూరు, చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం గ్రామాలున్నాయి. గ్రామీణ ప్రాంతంలో ప్రధాన రహదారులు కావడంతో ద్విచక్ర వాహనంపై వెళ్లాలంటే నరకం కనిపిస్తున్నట్టు జనం చెబుతున్నారు.

బిల్లులు చెల్లిస్తే పూర్తి

రోడ్ల కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తే మిగిలిన పనులు పూర్తి చేసే అవకాశం ఉంటుంది. కొత్త ప్రభుత్వం రావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. 70 శాతం మేర పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తామని సర్కారు పెద్దలు ప్రకటించారు. పనులు ప్రారంభం కాని, 20 శాతం చేపట్టిన వాటిని రద్దు చేసే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. అయితే కనుపర్తి, నావూరు రోడ్లు 70 శాతం పనులు పూర్తి చేయడం వల్ల బిల్లులు మరో నెలరోజుల్లో చెల్లించే అవకాశం ఉందని, ఫలితంగా ఆలస్యంగానైనా పూర్తవుతాయని అధికారులు వెల్లడిస్తున్నారు.

మండలంలో ప్రధానమైన రోడ్ల పనులు అర్థాంతరంగా ఆగిపోయాయి. దీంతో గ్రామీణ ప్రజలు అసంపూర్తి రోడ్లపై ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. సకాలంలో మండల కేంద్రానికి చేరుకోలేకపోతున్నామని వాపోతున్నారు. ఈ రహదారుల మధ్యలో బ్రిడ్జి నిర్మాణ పనులు కూడా ఉన్నాయి. వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. పాలకులు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి



అసంపూర్తిగా ఉన్న రోడ్డుపై ప్రయాణం ఇబ్బందిగా మారింది. గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు వీలైనంత త్వరగా పనులను పూర్తి చేయించాలి. ప్రభుత్వం వెంటనే స్పందించాలి.

– ఎ.వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్, కనుపర్తి

ప్రమాదాలకు గురవుతున్నారు



నావూరు రోడ్డుపై ప్రయాణం నరకంగా మారింది. కంకర తేలిపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వెంటనే అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను పూర్తి చేయాలి. మార్గమధ్యలో వాగులు ఉన్నందున వర్షాకాలంలో వెళ్లలేకపోతున్నాం. పెద్దవాగుపై బ్రిడ్జిని కూడా పూర్తి చేయాలి.

– వి.మాలకొండారెడ్డి, చెన్నారెడ్డిపల్లి

త్వరలో ప్రారంభిస్తారు

కాంట్రాక్టర్లు త్వరలో పనులు ప్రారంభిస్తారు. 70 శాతం పూర్తి చేసిన రోడ్లకు నిధులను విడుదల చేయడం జరుగుతుంది. ఈ విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్టు తెలుస్తోంది. తమ వద్ద జరిగిన పనులకు నివేదికలను స్వీకరించడం జరిగింది. మరో నెలరోజుల్లో పనులు చేపట్టే అవకాశం ఉంది.

– సుధాకర్‌రావు, ఏఈ, పీఆర్ ప్రాజెక్ట్స్, పొదలకూరు

నాగుల చవితి సందర్భంగా..



నాగుల చవితి సందర్భంగా మండలంలోని నారికేళపల్లి పంచాయతీ సుబ్బారెడ్డిపాళెం యూపీ స్కూల్ తెలుగు పండిట్ సోమా పద్మారత్నం రావి ఆకుపై కళారూపాన్ని రూపొందించారు.

– ముత్తుకూరు

మాజీ మంత్రి కాకాణి రాక నేడు

పొదలకూరు: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం ఉదయం 11 గంటలకు కనుపూరు కాలువను పరిశీలిస్తారని ఆ పార్టీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాలువ పూడికతీత పనులు జరుగుతున్న నేపథ్యంలో నాణ్యతా ప్రమాణాలను రైతులతో కలిసి పరిశీలించడం జరుగుతుందని వెల్లడించారు.

సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యం



మాట్లాడుతున్న కో-ఆర్డినేటర్ రాజశేఖర్

మనుబోలు: ఉల్లాస్ కార్యక్రమం ద్వారా మండలంలో సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యమని వయోజన విద్య జిల్లా కో–ఆర్డినేటర్ రాజశేఖర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం వెలుగు వీఓఏలకు ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు, మధ్యాహ్న భోజన పథకం వంటవారు, ఆయాలు, వాచ్‌మెన్లు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలన్నారు. 15 నుంచి 50 ఏళ్ల లోపు నిరక్షరాస్యులను గుర్తించి వారికి అక్షరాస్యతా కార్యక్రమాల ద్వారా చదువు నేర్పించాలని సూచించారు. నవంబర్ 5 నుంచి 2025 మార్చి 15 వరకూ ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం వనజాక్షి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ, సీసీలు రాజేశ్వరి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

‘సూర్యఘర్’పై అవగాహన కల్పించాలి



బుచ్చిరెడ్డిపాళెం : మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీహరి



పొదలకూరు: మాట్లాడుతున్న డీఈ సుబ్రహ్మణ్యం

బుచ్చిరెడ్డిపాళెం: ప్రధాన మంత్రి సూర్యఘర్ సోలార్ విద్యుత్ పథకం గురించి గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని, అందుకు విద్యుత్ శాఖాధికారులు, కార్యదర్శులు చొరవ చూపాలని ఎంపీడీఓ శ్రీహరి కోరారు. బుచ్చిరెడ్డిపాళెంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సూర్యఘర్ పథకంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీపీఓ మాట్లాడుతూ ఈ పథకం వల్ల ఇంటి అవసరాలతో పాటు మిగులు కరెంటును ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీఈ సతీష్‌బాబు, పట్టణ ఏఈ మనోహర్, దామరమడుగు ఏఈ, ఈఓపీఆర్డీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

- **పొదలకూరు:** స్థానిక ఎంపీడీఓ సమావేశ మందిరంలో సోమవారం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ సెక్రటరీలకు సోలార్ విద్యుత్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సూర్యఘర్ పేరుతో సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకుంటే రాయితీలను అందజేస్తున్నట్టు తెలిపారు. సోలార్ సిస్టమ్‌ను అమర్చుకునేందుకు అయ్యే ఖర్చును బ్యాంక్‌లు రుణాల కింద అందజేస్తాయని, పథకంలో గృహ వినియోగదారులు సోలార్ విద్యుత్‌ను వాడితే అతితక్కువ బిల్లులు చెల్లించే అవకాశం ఉంటుందని చెప్పారు. ఎంపీడీఓ డీవీ నరసింహారావు మాట్లాడుతూ పంచాయతీ సెక్రటరీలు సచివాలయల ద్వారా సోలార్ విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించాల్సిందిగా పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన రాయితీలను వివరించాలన్నారు. సమావేశంలో ఏఈ శ్రీకాంత్, విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కామాక్షమ్మ ఆలయంపై నిర్లక్ష్యం

- ఏర్పాట్లు చేయడంలో ఈఓ విఫలం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షి తాయి ఆలయానికి కార్తీక మాసంలో జిల్లా వ్యాప్తంగా భక్తులు అధిక సంఖ్యలో వెళ్లి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. ఏటా దాతల సహకారం, ఈఓ చొరవతో కార్తీక మాసంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. దీనిపై ముందస్తు సమాచారం తెలిపేలా కరపత్రాలను కూడా విడుదల చేస్తుంటారు. అయితే ఈ ఏడాది ఆలయ ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి ఆ దిశగా ఆలోచనే చేయలేదు. కోవూరు ఎమ్మెల్యేగా ఉన్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అమ్మవారి భక్తురాలు అని టీడీపీ నాయకులు ప్రచారం చేస్తుంటారు. పవిత్ర కార్తీక మాసంలో చేపట్టాల్సిన పూజా కార్యక్రమాలు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాల గురించి ఆమె ఆలయ అధికారులతో ముందుగా సమావేశం ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేయాలి. కానీ ఎమ్మెల్యేతో పాటు ఆలయ ఈఓ కూడా తనకెందుకులే అన్నట్లు వ్యవహరిస్తుండడంతో కార్తీక మాసంలో ఆలయానికి భక్తుల తాకిడి తగ్గింది. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి ప్రత్యేక పూజలు జరిగేలా చూడాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

పశుగణనపై శిక్షణ

వరికుంటపాడు : దుత్తలూరు ప్రాంతీయ పశువైద్యశాలలో పశుగణనపై దుత్తలూరు, వరికుంటపాడు మండలాలకు సంబంధించిన పశు సంవర్ధక శాఖ సహాయకులకు సోమవారం శిక్షణ ఇచ్చారు. పశువైద్యాధికారి ఎస్వీ రాఘవేంద్రశర్మ మాట్లాడుతూ వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు పశుగణన సర్వే జరుగుతుందని తెలిపారు. సర్వేకు నియమించిన సిబ్బంది ఇంటింటిని సందర్శించి పశువులు, జీవాలు, కోళ్లు, తదితర మూగ జీవాలను నమోదు చేయాలని సూచించారు.

ప్రసన్నకు నాయకుల అభినందన



ప్రసన్నకు అభినందనలు తెలుపుతున్న కొమరిక నాయకులు



ప్రసన్నతో కొడవలూరు ఎంపీపీ

కోవూరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో సోమవారం ఇందుకూరుపేట మండలం కొమరిక గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు ఎ.శివకుమార్‌రెడ్డి, ఒ.సురేంద్రబాబు, పెంచలయ్య, నాగేశ్వర్‌రావు, జనార్దన్, రవి మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. అలాగే డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, కొడవలూరు ఎంపీపీ గాలి జ్యోతి, పార్టీ నాయకులు గాలి సునీల్, రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, పందిటి సాకేష్‌రెడ్డి, మిడమలూరు విశ్వతేజ, తోకల వెంకటేష్ కలిసి పూలమొక్కను అందించారు.

ప్రమాదాలకు కేరాఫ్‌గా మారిన మలుపులు



మల్లికార్జునపురం సమీపంలో మలుపు



మాచర్లవారిపాళెం సమీపంలో ఇలా..

తోటపల్లిగూడూరు: మండలంలోని ఆర్‌అండ్‌బీ రహదారిలో ఉన్న పలు మలుపులు ప్రమాదాలకు కేరాఫ్‌గా మారాయి. ముఖ్యంగా తోటపల్లిగూడూరు – సాలిపేట ఆర్‌అండ్‌బీ రహదారిలో మాచర్లవారిపాళెం, మల్లికార్జునపురం, వరకవిపూడి ప్రాంతాల్లో, కోడూరు – సాలిపేట మార్గంలో ఉన్న పలు పలుపులు ప్రమాదాలకు నిలయంగా మారిపోయాయి. వీటి వద్ద ఎలాంటి స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు లేవు. వాహనాలు దగ్గరకు వచ్చేంత వరకు ఒకదానికొకటి కనిపించవు. ఈ క్రమంలో ఆయా మార్గాల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గడిచిన ఏడాది కాలంగా ఆయా మార్గాల్లో అనేక రోడ్డు ప్రమాదాలు జరిగినా సంబంధిత అధికారులు ఎలాంటి రక్షణ చర్యలను చేపట్టలేదు. ఇప్పటికైనా స్పందించి స్పీడ్ బ్రేకర్లు లేదా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నియంత్రించాల్సి ఉంది.

పెన్నానదిలో ఈతకెళ్లి వ్యక్తి మృతి



వెంకయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పొదలకూరు: మండలంలోని సూరాయపాళెం గ్రామ ఎస్టీ కాలనీకి చెందిన ఓ వ్యక్తి మద్యం మత్తులో పెన్నానదిలో ఈతకు దిగి మృతిచెందిన ఘటన సోమవారం జరిగింది. ఎస్సై ఎస్‌కే హనీఫ్ కథనం మేరకు.. గ్రామ గిరిజన కాలనీలో నివాసం ఉంటున్న ఆదిపూడి వెంకయ్య (45) నదిలో ఈతకొట్టేందుకు దిగాడు. మద్యం మత్తులో ఉండడంతో ఊపిరాడక మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వినతి

జలదంకి: మండల కేంద్రమైన జలదంకిలోని యాదవవీధి, వసతి గృహ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి రావి మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ ప్రమీలకు సోమవారం ఆయన వినతిపత్రం అందజేశారు. యాదవవీధి మధ్యలో 150 మీటర్ల దూరం రోడ్డు కుంగిపోయి ఉందన్నారు. దీంతో చిన్నపాటి వర్షం పడినా నీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోందన్నారు. ఈ వీధిలో నిత్యం రాకపోకలు సాగించే ఉన్నత పాఠశాల విద్యార్థులు, పీహెచ్‌సీ వైద్యసిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వసతిగృహం రోడ్డులోనూ వంద అడుగుల దూరం వరకు నీరు నిల్వ ఉంటుండడంతో ప్రజలు, విద్యార్థుల ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు.

ఆయన వెంట సీపీఎం నాయకులు ఆంథోని బాబు, గడ్డం మాల్యాద్రి తదితరులున్నారు.

కార్తీకం.. దివ్య శోభితం

మనుబోలు: కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మనుబోలు శివాలయం, వీరభద్రస్వామి, విశ్వనాథస్వామి, సంగమేశ్వర ఆలయాలతోపాటు, బద్దెవోలు, పిడూరుపాళెం, వెంకన్నపాళెం, కొలనకుదురు, పిడూరు, మడమనూరు, చెర్లోపల్లి తదితర గ్రామాలలోని శివాలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.

- **తోటపల్లిగూడూరు:** మండలంలోని కాటేపల్లిలో ఉన్న పద్మావతి సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం పూజలు జరిగాయి. భక్తులు స్థానికంగా ఉన్న కాటేపల్లి సముద్ర తీరంలో పుణ్యస్నానాలు ఆచరించారు.
- **పొదలకూరు:** పట్టణంలోని కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి (శివాలయం) దేవస్థానంలో మహిళలు భక్తిశ్రద్ధలతో కార్తీక మాస తొలి సోమవారం పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రమిదలు వెలిగించారు. ఆకాశం దీపంలో నూనె పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం ప్రధానార్చకుడు ప్రసాద్‌స్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని చెన్నారెడ్డిపల్లి గ్రామ పంచలింగేశ్వరస్వామి ఆలయం, మరుపూరు శ్రీకామాక్షి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానాల్లో మహిళలు పూజలు నిర్వహించారు.
- **ఇందుకూరుపేట :** కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా మండలంలోని ఇందుకూరుపేట, కొత్తూరు, మైపాడు, గంగపట్నం, ముదివర్తిపాళెం, కొరుటూరు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో అభిషేకాలు, విశేష పూజలు జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మైపాడు బీచ్‌లో సముద్రస్నానాలు ఆచరించారు. మహిళా భక్తులు తీరంలో ఇసుకతో శివలింగాలను ఏర్పాటు చేసుకుని పూజలు చేశారు. అనంతరం తీరంలో కొలువుదీరిన శివయ్యను దర్శించుకున్నారు. భక్తుల రాకతో తీరంలో సందడి నెలకొంది.



మనుబోలు: విశ్వనాథస్వామి



మనుబోలు: ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు



ఇందుకూరుపేట : సముద్రస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



ఇందుకూరుపేట : తీరంలో పూజలు చేస్తున్న మహిళలు



టీపీగూడూరు: కాటేపల్లి శివాలయంలో భక్తులు



పొదలకూరు: శివాలయం ప్రాంగణంలో..